## బొటానికల్ గార్డెన్‌లో...

# చిన్నారుల సందడి

కొత్తగా ప్రవేశపెట్టిన బోటింగ్‌కు అనూహ్య స్పందన



మ్యూజిక్‌కు అనుగుణంగా నృత్యం చేస్తున్న బుడతలు



బోటింగ్‌లో సంతోషాన్ని ఆస్వాదిస్తున్న చిన్నారులు

గచ్చిబౌలి, మేజర్‌న్యూస్: నగరశివారు కొండాపూర్‌లోని కోట్ల విజయభాస్కర్‌రెడ్డి బొటానికల్ గార్డెన్‌లో నూతనంగా ప్రవేశపెట్టిన బోటింగ్‌కు సందర్శకుల నుంచి అనూహ్య స్పందన కనిపిస్తోంది. రోజురోజుకు కొత్త అందాలను తీసుకొస్తున్న గార్డెన్ నిర్వాహకులు తాజాగా బోటింగ్‌ను ప్రవేశపెట్టారు. మొదటి విడతగా ఐదు బోట్లను ప్రవేశపెట్టారు. అందులో నాలుగు సీట్ల పెడలింగ్ బోట్లు, రెండు సీట్ల పెడలింగ్ బోట్లు రెండింటిని ఏర్పాటు చేశారు. అరగంటపాటు బోటింగ్ చేయడానికి 4 సీట్ల బోటుకు 50 రూపాయలు, 2 సీట్ల బోటుకు 30 రూపాయలు వసూలు చేస్తున్నారు.

బోటింగ్ చేసేవారికి లైఫ్ జాకెట్లు అన్ని వయస్సుల వారికి ఇవ్వడానికి కూడా ఏర్పాట్లు చేశారు. బోట్లను నిరంతరం కనిపెడుతూ ఒక వ్యక్తిని పర్యవేక్షించేందుకు ఏర్పాట్లు చేశామని అధికారులు తెలిపారు. ముఖ్యంగా శని,ఆది వారాల్లో గార్డెన్‌కు విశేషంగా సందర్శకులు వస్తుండడంతో నూతనంగా ఈ బోటింగ్‌ను ప్రవేశ పెట్టినట్లు పేర్కొన్నారు.

ఇదిలావుండగా శుక్రవారం గార్డెన్‌లో పెద్ద సంఖ్యలో చిన్నారులు రావడంతో సందడి సందడిగా మారింది. ముఖ్యంగా మ్యూజిక్‌కు అనుగుణంగా చిన్నారులు గ్రూపుగా నృత్యం చేస్తూ అందరినీ అకట్టుకున్నారు. కాగా ప్రతి వీకెండ్‌లోని శని,ఆదివారం రోజులలో సుమారు 3వేల నుంచి 4వేల మంది సందర్శకులు వస్తున్నట్లు వారు తెలిపారు. మరింతగా సందర్శకులను ఆకట్టుకోవడానికి కొత్తకొత్త సౌకర్యాలను ఏర్పాటును దశల వారిగా ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు.

# ఘనంగా బక్రీద్

- మీరాలం ఈద్గా, మక్కా మసీదులో భారీగా తరలి వచ్చిన ముస్లిం సోదరులు
- పాతబస్తీలో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు



కులీ కుతుబ్‌షాహి టూంబ్స్ వద్ద ప్రార్థనలు



మక్కా మసీదులో ప్రార్థనల అనంతరం...

చార్మినార్, మేజర్‌న్యూస్: జంటనగరాల్లోని ముస్లీంలు ఈదుల్ జోహ (బక్రీద్) ప్రార్థనలను శనివారం భక్తి ప్రపత్తులతో ఘనంగా నిర్వహించారు. నగరంలోని చారిత్రాత్మక మీరాలం ఈద్గా, మక్కా మసీదులలో భారీ సంఖ్యలో ముస్లిం సోదరులు ప్రార్థనలకు తరలి రావడంతో ఈద్గా పరిసరాలతోపాటు అటు బహదూర్‌పురా చౌరస్తా, ఇటు మీరాలం ట్యాంకు వరకు జనంతో నిండిపోయాయి. ప్రార్థనలకు తరలివచ్చిన వారు రోడ్లపైన జానిమడ్‌లు పరిచి ప్రార్థనలు నిర్వహించారు. ఉదయం 9.30గంటలకు మక్కా మసీదు ఖతీబ్ మౌలానా ప్రార్థనలకు ముందు దారుల్ ఉలూమ్ వ్యవస్థాపకుడు అమీదుద్దీన్ అఖీల్ హుసామి, ఆయన కుమారుడు మౌలానా జాఫర్ పాషాలు ధార్మిక ప్రసంగంలో పండుగ పాశీస్త్యాన్ని వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ముస్లిం తమతమ స్థోమతను బట్టి ఖుర్బానీ నిర్వహించాలని వాటిని తప్పకుండా చేయాలని ఆయన తెలిపారు. ఇస్లాం మత ప్రవక్త ఇబ్రహీం అలైహివా సలాం నుంచి వస్తున్న ఖుర్బానీను కొనసాగించాలని వారు కోరారు. ప్రార్థనలకు ఎలాంటి అసౌకర్యాలు కల్గకుండా వివిధ శాఖల అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఈదుల్ జుహా ప్రార్థనలో మజ్లిస్ క్యాంపు కొత్త కార్పొరేటర్‌లతో కిటకిటలాడింది. ప్రార్థనలకు ఎమ్మెల్యే అహ్మద్ పాష ఖాద్రీ పాల్గొని ప్రార్థనల అనంతరం ముస్లిం సోదరులను అలింగనం చేసుకుని ఈద్ ముబారక్ తెలిపారు. మజ్లిస్ క్యాంప్‌లో కార్పొరేటర్లు అబ్దుల్ గఫార్, మీర్జాజ్ మహ్మద్, మోబిన్, అబ్దుల్ గఫార్‌లు పాల్గొన్నారు.

మీరాలం ఈద్గాలో శనివారం ఉదయం జరిగిన ప్రార్థనలకు ఎలాంటి ఆవాంఛనీయ సంఘటనలు జరుగకుండా దక్షిణ మండలం డీసీపీ ఆధ్వర్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ముందస్తు చర్యలో భాగంగా టాస్క్‌ఫోర్సు, సీఆర్‌పీఎఫ్, సివసిల్ పోలీసులను మోహరించారు. నగర పోలీస్ కమీషనర్ ప్రసాద్‌రావు ఇతర పోలీసు ఉన్నతాధికారులతో కల్సి పోలీస్ క్యాంపులో ఉంచి బందోబస్తును పర్యవేక్షించారు.



మీరాలం ఈద్గా వద్దకు భారీగా తరలివస్తున్న ముస్లిం సోదరులు



బక్రీద్ శుభాకాంక్షలు తెలుపుకుంటున్న చిన్నారులు

## ఫ్యాషన్ ప్రియులకోసం...

# 'బూమ్' స్టోర్



బూమ్ స్టోర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

హైదరాబాద్, మేజర్‌న్యూస్: మారుతున్న ఫ్యాషన్ ట్రెండ్‌కు అనుగుణంగా యువతరం కోసం అనేక ఫ్యాషన్‌స్టోర్స్ అందుబాటులోకి వస్తున్నాయి. యువత మనోభావాలకు అవసరమయ్యే దుస్తులు, ఇతర యాక్సెసరీస్‌ను ఇవి ఏర్పాటు చేస్తున్నాయి. ఈ తరుణంలో శనివారం నగరంలోని మూసారంబాగ్‌లో 'బూమ్' పేరుతో ఏర్పాటు చేసిన ఈ స్టోర్‌ను ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి లాంఛనంగా ప్రారంభించారు. సుధీర్‌రెడ్డితోపాటు ఈ కార్యక్రమంలో నగర కాంగ్రెస్, పీఆర్పీ, నాయకులు లింగాల బస్వరాజ్, దుగ్గ రఘులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ యువత ఫ్యాషన్ వస్త్రాలను అందించేందుకు స్టోర్‌ను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. బూమ్ ఫ్యాషన్‌స్టోర్ నిర్వాహకులు రాఘవ్ మాట్లాడుతూ బ్రాండెడ్ దుస్తులతోపాటు బెంగళూరు, ముంబాయి, నగరాలనుంచి విభిన్న రకాల వస్త్రాలను అందుబాటులోకి తెచ్చినట్లు వివరించారు.

## ఎన్టీఆర్ స్టేడియంలో భగద్గీత పారాయణం...

# ఆనందసాగరంలో భక్తులు

### వేలాదిగా తరలివచ్చిన ప్రజలు



మేజర్‌న్యూస్, సిటీబ్యూరో: వికాసతరంగిణి సేవా సంస్థ ఆధ్వర్యంలో శనివారం ఎన్టీఆర్ స్టేడియంలో నిర్వహించిన విశ్వశాంతి భగవద్గీత విరాట్ పారాయణ కార్యక్రమంలో వేలాదిమంది భక్తులు చినజీయర్‌స్వామితో కలసి ముక్తకంఠంతో భగవద్గీతా పారాయణంచేసి ఆనంద పరవశులయ్యారు. ఈ సందర్భంగా స్వామి నేతృత్వంలో భక్తులంతా భగవద్గీతలోని ప్రతి అధ్యాయాన్ని పారాయణంచేయగా, అధ్యాయం ముగిసిన వెంటనే స్వామివారు అందులోని కృష్ణపరమాత్ముని గీతాసారంపై వివరణాత్మక ప్రసంగాలు చేశారు. ఎంతో క్రమశిక్షణతో, శ్రద్ధా భక్తులతో ఉదయం 8గంటల నుంచి సాయంత్రం వరకూ నిర్విఘ్నంగా సాగిన ఈ భగవద్గీతా పారాయణ కార్యక్రమంలో ముఖ్యమంత్రి కె. రోశయ్య, మైహోమ్ గ్రూప్ సంస్థల అధినేత జె.రామేశ్వరరావు, ఎమ్మెల్యే ఎర్రబెల్లి దయాకరరావు, వికాసతరంగిణి సంస్థ అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి, వివిధ రంగాలకు చెందిన భక్తులు స్వామివారి మంగళాశాసనాలను అందుకున్నారు. నగరం నలుమూలల నుంచి తండోపతండాలుగా తరలివచ్చిన భక్తజన సందోహంకోసం మంచినీళ్ళు, తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు. స్త్రీలకు, వికలాంగులకు, వయోవృద్ధులకు ప్రత్యేక విభాగాలను ఏర్పాటుచేశారు. స్టేడియం ఆవరణలో వేసిన విశాలమైన పందిళ్ళలో చినజీయర్ స్వామి ప్రవచనాలు ఓవైపు కొనసాగుతుండగా, మరోవైపు ఆవరణకు ఇరువైపులా ఏర్పాటుచేసిన వికాసతరంగిణి సంస్థ సేవా కార్యకలాపాల, పుస్తక ప్రదర్శనశాలలు, ఆయుర్వేద వైద్య ప్రద్శనశాలల్లో భక్తులకు విరివిగా సేవలందించారు.



చినజీయర్ స్వామి నుంచి తీర్థం అందుకుంటున్న ముఖ్యమంత్రి కె. రోశయ్య

## పీపుల్స్ ప్లాజాలో...

# గిరిజనుల హస్తకళల ప్రదర్శన



జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ముఖ్యమంత్రి రోశయ్య, చిత్రంలో కేంద్రమంత్రి, ఎంపీలు

### ఆదిశిల్పి - 2009 కార్యక్రమానికి పలువురు ప్రముఖుల హాజరు

నాంపల్లి, మేజర్‌న్యూస్: గిరిజనులు ఉత్పత్తి చేసే వస్తువులపై గిట్టుబాటు ధర కల్పించేందుకు ప్రభుత్వం కొనుగోలు విక్రయ కేంద్రాలు కల్పించి వారిని ఆర్థికంగా అభివృద్ధి చెందెందుకు ఎల్లవేళలా కృషి చేస్తుందని ముఖ్యమంత్రి రోశయ్య అన్నారు. గిరిజనులు అన్ని రంగాల్లో అభివృద్ధికోసం ప్రభుత్వం పలు సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిందని వాటిని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పీపుల్ ప్లాజాలో పది రోజుల పాటు జరిగే ఆదిశిల్పి-2009 జాతీయ గిరిజన క్రాఫ్ట్ ఎగ్జిబిషన్ షోను శనివారం ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎగ్జిబిషన్‌లో ఏర్పాటు చేసిన సభలో సీఎం రోశయ్య గిరిజనులనుద్దేశించి మాట్లాడుతూ 1987లో మాజీ ప్రధాని ఇందిరాగాంధీ హాయాంలో ప్రవేశపెట్టిన 20సూత్రాల పథకంతోనే అన్ని గిరిజనుల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వాలు పాటుపడ్డాయని ఆయన అన్నారు. గిరిజనులు తమలో దాగిఉన్న సృజనాత్మక నైపుణ్యంతో తయారుచేసిన వివిధ రకాల వస్తువులు మార్కెట్లోకి తీసుకు రావడం అభినందనీయమని ఆయన కొనియాడారు. గిరిజనుల సంపద, సంస్కృతిని చాటి చెప్పె విధంగా వస్తువులు వున్నాయని ఆయన చెప్పారు. అలాగే గిరిజన ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు ఏర్పాటుకు కృషిచేస్తామని ఆయన అన్నారు. కేంద్ర, రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రులు కాంతిలాల్ బూరియలు, పసులేటి బాలరాజులు మాట్లాడుతూ గిరిజనులకు చేతివృత్తి శిక్షణ ఇచ్చి వివిధ వస్తువుల తయారు చేసుకునేందుకు ఇప్పటికే గోవా, కర్నూలు, శ్రీశైలం, విశాఖపట్నం ప్రాంతాల్లో 300 శిక్షణ శిబిరాలు ఏర్పాటు చేయడం జరిగిందని ఆయన అన్నారు. ఇలాంటి ఎగ్జిబిషన్లు గిరిజనుల్లో సత్ సంబంధాలు ఏర్పడుతాయని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో క్రిష్టియన్ లాజరస్, గిరిజన సంక్షేమ శాఖ ఛైర్మన్ కాలుసింగ్ నల్వాయి, వివిధ జిల్లాల నుంచి గిరిజనులు తమ వేషాధారణలతో వచ్చి ముఖ్యమంత్రికి స్వాగతం పలికారు.









# 'కోట్ల'లో ఇండియా ఇంటర్నేషనల్ ట్రావెల్ మార్ట్



'కోట్ల' ఇండోర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన ట్రావెల్ మార్ట్‌లోని స్టాల్



ట్రావెల్ మార్ట్‌లో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమంలోని ఓ దృశ్యం

హైదరాబాద్, మేజర్‌న్యూస్: పర్యాటకరంగం అనూహ్యంగా అభివృద్ధి చెందుతోంది. దేశ విదేశీ ప్రతినిధులు పర్యాటక స్థలాలను తిలకించేందుకు ఉత్సాహం చూపుతున్నారు. హైదరాబాద్ వాసులు కూడా విదేశాలకు వెళ్లాలని తహతహలాడుతున్నారు. ఈ తరుణంలో దేశంలోని పలు పర్యాటక ప్రాంతాల గురించి సమాచారం అందించే ఇండియా ఇంటర్నేషనల్ ట్రావెల్ మార్ట్ శనివారం నగరంలో ప్రారంభమైంది. యూసుఫ్‌గుడలోని కోట్ల విజయ భాస్కర్‌రెడ్డి ఇండోర్ స్టేడియంలో ఈ ట్రావెల్ మార్ట్‌ను ఏర్పాటు చేశారు. ఈనెల 30వ తేదీ వరకు ఈ ప్రదర్శన జంటనగరాల ప్రజలకు అందుబాటులో ఉంటుంది. ట్రావెల్ ఏజెంట్లు, టూర్ ఆపరేటర్లు, డీఎంసీ, హోటల్స్, రిసార్ట్స్, ఎన్జీఓ, క్రూసెస్, ఎయిర్‌లైన్స్, ఆన్‌లైన్ ట్రావెల్ పోర్టల్స్ తదితర సంస్థలు ఇందులో స్టాల్స్‌ను ఏర్పాటు చేశాయి. ఈ సందర్భంగా ఎగ్జిబిషన్ డైరెక్టర్ సంజయ్ హాకు మాట్లాడుతూ హైదరాబాద్ ప్రజలకు పర్యాటక రంగానికి సంబంధించిన సమగ్ర సమాచారాన్ని అందించాలన్న ఉద్దేశ్యంతో ఈ ప్రదర్శనను ఏర్పాటు చేసినట్లు వివరించారు.

# భిన్న రుచుల 'బికనర్‌వాలా' రెస్టారెంట్

### బంజారాహిల్స్ రోడ్‌నం.1లో నేటి నుంచి ప్రారంభం

హైదరాబాద్, మేజర్‌న్యూస్: భోజనప్రియులు విభిన్నరకాల రుచులను కోరుకుంటున్నారు. ఇంట్లో రోజూ తినే తిండితో విసుగెత్తిన నగరవాసులు కొత్త వంటకాల కోసం తహతహలాడుతున్నారు. ఈ తరుణంలో అంతర్జాతీయ ప్రమాణాలతో భాగ్య నగరంలో అరుదైన రెస్టారెంట్లు ఏర్పాటవుతున్నాయి. నగరవాసులు కోరుకున్న రుచులను సరికొత్త 'టేస్ట్'తో ముందుకు తెస్తున్నాయి. ఈ తరుణంలో నగరంలోని బంజారాహిల్స్ రోడ్ నెంబర్ 1లో బికనర్‌వాలా పేరుతో స్వీట్స్, స్నాక్స్ పాన్ ఇండియన్ కుజిన్ వంటకాలతో రెస్టారెంట్ అందుబాటులోకి రానుంది.

ఈ రెస్టారెంట్‌ను ఆదివారం నుంచి భోజనప్రియులకు అందుబాటులో ఉంచుతున్నామని బీఎఫ్‌పీఎల్, మేనేజింగ్ డైరెక్టర్ శ్యామ్ సుందర్ అగర్వాల్, డైరెక్టర్ చేతన్ అగర్వాల్, ఎగ్జి క్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ దీపా గుప్తా, మార్కెటింగ్ మేనేజర్ సంగీతా గోయల్‌లు తెలిపారు. శనివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ ఇండియా, నేపాల్, యూఏఈ, న్యూజిలాండ్‌లతోపాటు 33 ఔట్‌లెట్లు నడుస్తున్నాయన్నారు. భవిష్యత్‌లో వీటిని మరింత విస్తరించేందుకు సన్నాహాలు చేస్తున్నామని తెలిపారు.



తమ రెస్టారెంట్‌లోని ఓ వంటకాన్ని కస్టమర్లకు అందిస్తున్న బీఎఫ్‌పీఎల్ మేనేజింగ్ డైరెక్టర్ శ్యాంసుందర్ అగర్వాల్, ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ దీపాగుప్త